పేదల ఆరోగ్యానికి రక్ష







వృద్ధుడి ఆరోగ్య సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే శిల్పా, దామగట్లలో వృద్ధుడికి కంటి అద్దాలు పెడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్, ఇస్కాలలో ఈసీజీ చేస్తున్న డాక్టర్ ప్రతాపరెడ్డి, కంటి పరీక్షలు నిర్వహిస్తున్న కంటి వైద్యులు, మందులు పంపిణీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ శారదబాయి

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- దామగట్ల, ఇస్కాల గ్రామాల్లో వైద్య శిబిరాలు



ఇస్కాలలో పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గతంలో వైద్యం చేయించుకోవాలంటే ఎన్నో ఇబ్బందులకు గురయ్యే వారని ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వైద్యులు ప్రజల వద్దకే వెళ్లి సేవలందించి, ఉచితంగా మందులు అందజేస్తున్నారన్నారు. అనంతరం మెడికల్ క్యాంపునకు వచ్చిన రోగుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు కంటి అద్దాలను, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవరం సుశీలమ్మ, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపీడీఓ శోభారాణి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షకూర్, కౌన్సిలర్ ధర్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హరిసర్వోత్తమరెడ్డి, మాధవరం రత్నం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

మిడుతూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకానికి శ్రీకారం చుట్టారని అడిషనల్ డీఎంహెచ్‌ఓ శారద బాయి అన్నారు. గురువారం మండల పరిధిలోని దేవనూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, తహసీల్దార్ ప్రకాశ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు హరిత, ఎంపీటీసీ ఫరీద, డాక్టర్లు రాజు, శివకుమార్ గౌడ్, సామిత్‌రాఘవ్, చంద్రశేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య భద్రత ప్రభుత్వ బాధ్యత

పాములపాడు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ఆరోగ్య భద్రతను ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం మండలంలోని ఇస్కాల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వృద్ధులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. డాక్టర్లు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. బీపీ పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం స్థానిక పాఠశాల తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి విద్యాప్రమాణాల పై ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీకృష్ణ, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీపీ సరోజినీ వర్ధినియ, సర్పంచు మౌలాలి, వైస్ ఎంపీపీ బండ్లమూరి వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ మెంబర్ ముర్తుజావలి, జేసీఎస్ మండల కన్వీనర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల చెంతకే వైద్య సేవలు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంచేందుకు చేపట్టిన బృహత్తర కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష అని, ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల చెంతకే వైద్య సేవలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపునను సర్పంచు షేక్ నాజియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐసీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. శిబిరంలో 350 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని, ఇందులో 75 మందికి కంటి పరీక్షలు చేశామని, వివిధ ఆరోగ్య సమస్యల దృష్ట్యా 20 మందిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశామని వైద్యుడు విజయేంద్రవర్మ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం ఆఫీసర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రఘురాం, ఎంపీడీఓ మేరి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యం కోసమే ‘జగనన్న ఆరోగ్య సురక్ష’



భోజనం గ్రామంలో వృద్ధురాలికి కళ్లద్దాలు పెడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- రేగడగూడూరులో వైద్య శిబిరం

వెలుగోడు: అందరి ఆరోగ్యమే లక్ష్యంగా ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. రేగడగూడూరు గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి, వైద్య పరీక్షలు, రోగులకు అందుతున్న వైద్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నవంబర్ 15వ తేదీ వరకు శిబిరాలు కొనసాగుతాయన్నారు. హెల్త్ క్యాంపుల్లో చికిత్సలు చేశాక అవసరమైతే మెరుగైన వైద్యం అవసరమైతే ఆరోగ్య శ్రీ రెఫరల్ ఆస్పత్రులకు పంపుతామన్నారు. వెలుగోడు సీహెచ్‌సీ ఆసుపత్రిలో గుండె పోటు వచ్చిన సమయంలో రూ.40 వేలు విలువ చేసే ఇంజక్షన్లు ఉచితంగా వేస్తారని చెప్పారు. అనంతరం వేల్పనూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, నాయకులు నంది రెడ్డి రామిరెడ్డి పాల్గొన్నారు.

జోసఫ్ రిచర్డ్‌సన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెలుగోడు లిటిల్ ఏంజిల్స్ స్కూల్ కరస్పాండెంట్ ఇమ్మానుయేలు కుమారుడు జోసఫ్ రిచర్డ్‌సన్‌ను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోయ జనాభారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

మహానంది: ప్రతి పేదవాడి ఆరోగ్య సమస్యలు గుర్తించి ఉచితంగా ప్రత్యేక వైద్య నిపుణులతో మెరుగైన వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం భోజనం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డితో కలిసి వచ్చిన ఎమ్మెల్యే శిల్పాకు భోజనం గ్రామ సర్పంచ్ బారెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. శిబిరంలో ఒకేరోజు 354 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ విక్రమసింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాపకు గుండె పరీక్షలు చేయించా



నా కూతురు ఇందుప్రియ, ఒక సంవత్సరం పాప, పుట్టిన 20 రోజులకే తిరుపతిలో గుండె ఆపరేషన్‌చేయించాము. ప్రస్తుతం మోషన్స్‌తో బాధపడుతుంది, గుండెకు సంబంధించి మళ్లీ ఏమైనా సమస్య తలెత్తిందేమోనని ఇక్కడ చూపించాను. పరీక్షలు చేసి అంతా బాగుందన్నారు. మోషన్స్‌కు సిరప్ ఇచ్చారు.

–ప్రియాంక, ఇస్కాల

పరీక్షలు చేసి మందులు ఇచ్చారు



రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామంలోనే మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచితంగా వైద్యం అందించడం హర్షనీయం. నాకు గ్యాట్రబుల్, తలనొప్పి, నారాల బలహీనత ఉంది. వాటికి పరీక్షలు చేసి మందులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చాలా బాగుంది.

– అంజనమ్మ, జడ్డువారిపల్లె

ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నందికొట్కూరు: ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. గురువారం పట్టణంలోని టౌన్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. ముఖ్యమైన క్రైమ్ గురించి, పోలీసు పనితీరు గురించి ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. నైట్ బీట్‌లను పెంచేందుకు కృషి చేస్తానన్నారు. నేరాలకు తావులేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. సీఐ విజయభాస్కర్, ఎస్ఐలు ఎన్వీ రమణ, వెంకటసుబ్బయ్య, జగన్‌మోహన్ ఉన్నారు.

కుటుంబానికి అండగా ఉంటాం

కొత్తపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన బాధితుని కుటుంబానికి అండగా ఉంటామని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కొన్ని రోజుల క్రితం యాక్సిడెంట్ అయి మంచం పట్టిన బి.మహేశ్వరుడుని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి రాయితీలు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య, నాయకులు చింతమాను శ్రీనివాసులు యాదవ్, పాలెం లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

7న జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న ఉదయం 10గంటలకు హాజరు కావాలన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీ, ఈవైఏడీపీలో, బ్యాంకింగ్ ఉద్యోగాలు, జేపీ మార్గన్, స్టేట్ స్ట్రీట్‌లో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 26సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉండరాదన్నారు. అర్హత డిగ్రీ, బీటెక్ ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ : 9321825558, 7799337695 నెంబర్లను సంప్రదించాలన్నారు.

జగనన్నతోనే రైతుల సంక్షేమం



రైతులకు రాయితీ శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జనార్దన్‌గౌడ్

నందికొట్కూరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నతోనే రైతన్నల సంక్షేమం సాధ్యమవుతుందని సర్పంచ్ జనార్దన్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో రైతులకు ప్రభుత్వం సబ్సిడీ కింద అందజేసిన శనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ విజయ్, రైతులు మురళీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రాయితీపై వలలు, తెప్పలు

నంద్యాల(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు రాఘవరెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, మత్స్య అభివృద్ధి పథకాల కింద 75 శాతం రాయితీతో మత్స్యకారులకు వలలు, తెప్పలు అందజేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. జలాశయాలు, చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు లైసెన్స్ కలిగిన వారు, మత్స్య సహకార సంఘాల సభ్యులు మాత్రమే అర్హులన్నారు. వల, తెప్ప కలిపి రూ.50 వేలు కాగా ఇందులో లబ్ధిదారుడు తన వాటాగా రూ.12,500 భరిస్తే, మిగతా రూ.37,500ల రాయితీ ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. వచ్చే సోమవారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అన్ని అంశాలు క్రోడీకరించిన తర్వాత అర్హుల జాబితాను కమిషనర్ కార్యాలయానికి పంపుతామని చెప్పారు. ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకోని వారు, వెంటనే సంబంధిత సచివాలయాన్ని సంప్రదించాలని లేదా బొమ్మలసత్రం బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌లోని మత్స్యశాఖ జేడీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రాయితీపై చేప పిల్లలు

చిన్న నీటి పారుదల శాఖ కింద ఉన్న చెరువులు, జలాశయాల్లో చేపపిల్లలు వదిలే వారికి ప్రభుత్వం రాయితీతో లబ్ధి కలిగిస్తోందని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు రాఘవరెడ్డి తెలిపారు. 100 హెక్టార్లలో లక్ష చేప పిల్లలు వదిలితే అందులో 40 వేల చేప పిల్లల కొనుగోలుకయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని, మిగతా 60 వేల చేప పిల్లల ఖర్చు లబ్ధిదారుడు పెట్టుకోవాలని తెలిపారు. లక్ష చేప పిల్లలకు రూ.64 వేల దాకా రాయితీ అవుతుందని అన్నారు.

వ్యర్థాలతో వన్యప్రాణులకు ముప్పు



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

మహానంది: అడవుల్లో భక్తులు వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ వస్తువులు వేయడం వల్ల వన్యప్రాణులకు ముప్పు ఉంటుందని, భక్తులు సహకరించాలని అటవీశాఖ ఎఫ్ఎస్ఓ అన్వర్‌హుసేన్, ఎఫ్‌బీఓ శ్రీనివాసులు కోరారు. మహానంది నుంచి కృష్ణనంది వెళ్లే మార్గంలో నల్లమలలోని గడిగుండం సెక్షన్‌లోని జాకల్ బేస్ క్యాంపు వద్ద గురువారం అటవీప్రాంతంలో వ్యర్థపదార్థాలను తొలగించారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ వాచర్లు శివ, స్టీఫెన్, సుబ్బరాయుడు, స్థానికులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

వన్యప్రాణులకు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌జా తెలిపారు. బండిఆత్మకూరులోని మోడల్‌స్కూల్‌లో గురువారం వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఫ్ఆర్ఓ నాసిర్‌జా మాట్లాడుతూ అడవుల సంరక్షణ ఎంత ముఖ్యమో, వన్యప్రాణుల సంరక్షణ అంతే ముఖ్యమన్నారు.

నందికొట్కూరు అభివృద్ధే లక్ష్యం



సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకరరెడ్డి

నందికొట్కూరు: పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకరరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 2వ వార్డులో కమిషనర్ కిషోర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. అలాగే అంతర్గత కాలనీల్లో, అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ నాయబ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, ఉపాధ్యక్షుడు చింత విజ్జి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అబూబక్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిజాంబవ అన్నదాన సత్రానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆదిజాంబవ(హిందూ మాల) సత్రం అధ్యక్షులు, సభ్యులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలో దేవస్థానం వారు ఆదిజాంబవ (హిందూమాల) సత్రం నిర్మాణం కోసం స్థల కేటాయింపుపై ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం సత్రం కమిటీ అధ్యక్షురాలు జి. సవమ్మ, కమిటీ సభ్యులు, సత్రం మీడియా కో ఆర్డినేటర్ సాల్మాన్‌రాజ్ స్థల పరిశీలన చేశారు. సత్రం అధ్యక్షురాలు సవమ్మ మాట్లాడుతూ హిందూ మాదిగ సత్రానికి శ్రీశైలదేవస్థానం మల్లమ్మ కన్నీరు ఆలయానికి సమీపంలో కేటాయించిన 50 సెంట్లు స్థలం పరిశీలించామన్నారు. ఈ స్థలంలో సత్ర నిర్మాణ పనులు, భూమి పూజ విషయమై అందరితో చర్చిస్తామన్నారు. మండల పరిధిలోని హిందూ మాదిగ బంధువులందరినీ కలుపుకుని ముందుకు వెళ్లాలని తీర్మానించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 20న సున్నిపెంటలో హిందూ మాదిగలందరి సమక్షంలో ఒక సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్రం ఉపాధ్యక్షులు దర్శనపు శ్రీనివాస్, కార్యదర్శి వై.అంకయ్య, ట్రెజరర్ కె.కాశయ్య, సభ్యులు ఎం. రామయ్య, ఎం.గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు



ఎంపికైన ఎలీషమ్మను సన్మానిస్తున్న ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు కావాలని ఎంఈఓ సుభాన్ అన్నారు. గురువారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన మండల పరిధిలోని తూర్పు ప్రాతకోట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఎలీషమ్మను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో చోటు చేసుకుంటున్న పెను మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు సిద్ధం కావాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అంకిత భావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 మురళిమోహన్ రెడ్డి, హెచ్ఎం బధుసూధన్‌రావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్ : లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం ఈఓ, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

నల్లకాల్వలో సమగ్ర భూ సర్వే ప్రారంభం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామంలో సమగ్ర భూసర్వే గురువారం ప్రారంభమైంది. వీఆర్ఓ రాజు ఆధ్వర్యంలో సర్వేయర్లు బాపనంతాపురం పొలి మేర నుంచి సర్వే చేపట్టారు. మొదటి రోజు 100 ఎకరాల సర్వే పూర్తయ్యింది.



సమగ్ర భూసర్వేలో నిమగ్నమైన రెవెన్యూ అధికారులు

నేడు రుద్రవరంలో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. గురువారం గ్రామానికి వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

శ్రీశైలంప్రాజెక్ట్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.పి.హుస్సేన్‌బాషా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైదని, భావి భారత పౌరులను జ్ఞాన వంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాలు అందించాలి

మహానంది: విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు అందించాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ వాసుదేవగుప్త సూచించారు. బండిఆత్మకూరు మండలం భోజనం గ్రామంలో ఎంఈఓ మోహన్‌రెడ్డితో కలిసి ప్రభుత్వ పాఠశాలలో గురువారం మధ్యాహ్నం భోజనం తనిఖీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ భోజనాల తయారీలో శుభ్రత పాటించాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

మిడుతూరు: మండలంలోని దేవనూరు గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ జగన్‌మోహన్ గురువారం తెలిపారు. దేవనూరు గ్రామంలో రాజేశ్వరి (25) అనే వివాహిత భర్త, మామల వేధింపుల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందన్నారు. పోలీసులు సమాచారం తెలుసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాజేశ్వరి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతురాలికి ఒక కొడుకు, ఒక కూతూరు ఉన్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి

కొత్తపల్లి: మహిళల హక్కులను సాధించాలంటే మహిళలందరూ ఐక్యంగా సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు స్వాతి, ప్రశాంతకుమారి పిలుపునిచ్చారు. ఈనెల 17, 18, 19 తేదీలలో నంద్యాలలో జరుగు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కే వెంకట శివుడు, మహిళా సమాఖ్య మండల కన్వీనర్ ముర్తుజాబీ, కొత్తపల్లి మహిళా సమాఖ్య కమిటీ నాయకురాలు నాగమణి, గ్రామ కార్యదర్శి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న సీనియర్ సైంటిస్ట్ అనిషిబా

నందికొట్కూరు రూరల్ : మండలంలో పత్తి పంటలను సాగు చేసిన రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కేంద్రీయ పత్తి పరిశోధనా సంస్థ సీనియర్ సైంటిస్ట్ అనిషిబా సూచించారు. గురువారం పట్టణంలోని ఆత్మ భవన్‌లో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల వల్ల అధిక సాంద్రత పద్ధతిని పాటిస్తే ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుమతి వస్తుందని తెలిపారు. పై పాటుగా ఎరువుల పిచికారీ చేయడం వల్ల మొక్కలు త్వరగా వినియోగించుకుంటుందన్నారు. పత్తిలో గులాబీ రంగు, రసం పీల్చే పురుగుల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ధనలక్ష్మి, రవిగౌడ్, ఏడీఏ విజయశేఖర్ పాల్గొన్నారు.

7న మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర

వెలుగోడు: శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం ఈనెల 7న అలంపూర్ నుంచి చేపడుతున్న మాదిగల విశ్వరూప మహా పాదయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఎంఆర్‌పీఎస్ నాయకులు విడుదల చేశారు. వెలుగోడు ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి వాదం నాగేషులు మాదిగ, బేడ బుడగ జంగాల అధ్యక్షుడు చిత్తారి మల్లికార్జున, వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు రావుఫ్, చిత్తారి కాంతారావు, మోతే ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



సుబ్బమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ పుష్పావతి

నందికొట్కూరు: పట్టణంలోని 1వ వార్డుకు చెందిన వితంతు మహిళ సుబ్బమ్మ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వార్డు వలంటీర్ పుష్పావతి గురువారం కర్నూలుకు వెళ్లి పింఛన్ నగదును అందజేసింది. వలంటీర్‌ను మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్ చిన్నరాజు అభినందించారు.


చక్రవర్తికి ఎంఫిల్ పట్టా



వర్సిటీ డీన్ శ్రీనివాసరావు నుంచి ఎంఫిల్ పట్టాను స్వీకరిస్తున్న చక్రవర్తి

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని పొట్టిశ్రీరాములు చరిత్ర, సంస్కృతి, పురావస్తుశాస్త్ర పీఠంలో గురువారం సత్యసాయిజిల్లా కదిరి లక్ష్మీ నరసింహస్వామి చరిత్ర – పరిశీలన అనే అంశంపై పరిశోధన చేసిన ఎం చక్రవర్తికి ఎంఫిల్ పట్టాను పీఠాధిపతి ముసుగు శ్రీనివాసరావు అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలంలోని మేకలబండ చెంచుస్కూల్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించి, తెలుగు వర్సిటీలో డిగ్రీ పూర్తి చేసి, ఎంఏ అయ్యాక ఎంఫిల్ కోర్సును పూర్తిచేసిన చక్రవర్తిని అభినందించారు. పూర్వ పీఠాధిపతి ఆచార్య పెద్దారపు చెన్నారెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు తెలిపారు.

అతివేగంగా ఆటోలు నడపొద్దు



మాట్లాడుతున్న సీఐ నాగభూషణం యాదవ్

ఆత్మకూరు: ఆటోడ్రైవర్లు ఆటోలను అతివేగంగా నడపరాదని ఆత్మకూరు సీఐ నాగభూషణం యాదవ్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటోల్లో సౌండ్‌బాక్స్‌లు పెట్టుకుని వాహనాలు నడపడం సరికాదన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. ఓవర్‌లోడింగ్ తో కూలీలను, ప్రయాణికులను తీసుకువెళ్లవద్దని సూచించారు. ప్రమాదాలు జరిగితే ఓవర్‌లోడ్ వలన ఇన్సూరెన్స్ కూడా రాదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్సైలు కృష్ణమూర్తి యాదవ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

మహానంది: మండలకేంద్రం తిమ్మాపురం గ్రామానికి చెందిన కిట్టయ్య కుమారుడు శివకేశవులు (4) అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం సాయంత్రం పిల్లలతో ఆడుకుంటూ కనిపించకుండా పోయాడన్నారు. ఆచూకీకోసం రాత్రి వరకూ గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గాలింపు చేపట్టినట్లు మహానంది పోలీసులు తెలిపారు.